


## "బాక్సు నెం. —"

అది 1947 వ సంవత్సరం-వాల్తేరు యూనివర్సిటీ కాలేజీలో బి. ఏ. చదువు కుంటూన్న రోజులవి. హాస్టల్లోవుంటూ, అందరం స్వేచ్ఛాజీవితాలు గడుపుతూ వుండేవాళ్ళం. అదే యింకొక విధంగా చెప్పాలంటే - 'హాస్టల్ లైఫ్' ఎన్‌జాయ్ చేసేవాళ్ళం అన్నమాట. నా గదిలో నాకు తగిన రూం మేట్స్ జతపడ్డారు. ఇక అడగనవసరంలేదు మా హడావిడి!

ఒకనాడు ప్రొద్దున్నే లేచి, కాఫీ త్రాగి, ఏమీతోచకపోతే, వూరికే కూర్చున్నాను. చదవ బుద్ధిపుట్టలేదు. ఆవేళటి 'హిందూ' పేపరు తీసేను. ఎందువల్లో గాని, నా దృష్టంతా ఒక్కసారి రెండవ పేజీలోని 'మేట్రి మోనియల్' ప్రకటనలమీదికి మళ్ళింది. మొదటిది చదివేను.

పిల్ల వయస్సు 18 — ఊఁ బాగానే వుందనుకున్నా. బ్రాహ్మణపిల్ల, అందముగా వుంటుందట — భేష్! ఈమెకు 25 ఏండ్లలోపలవయస్సుగల బ్రాహ్మణ వరుడు కావలెనట! నా వయస్సు ఎంతో ఒక్కసారి ఆలోచించేను. సరిగా 23 సం॥ ఛాన్సు బాగానే వుందనుకున్నాను. అంతేకాదు వరుడు బి. ఏ. గ్రేడ్యు వేట్ అయివుండాలట. ఒస్ యింతే; ఒక్క ఏడు కళ్ళుమూసుకుంటే ప్యాస్ అయిపోతా!......అప్లై బాక్సు నెం. 1819 అని కూడా వుంది.

నా అర్హతలన్నీ చాల బాగున్నాయని అనిపించింది. 'వాళ్ళు నిజంగా ఒప్పేసుకుంటే—నాన్‌సెన్స్ ఒప్పుకున్నప్పుడు చూద్దాం' అని అనుకున్నా. నా రూం మేట్స్‌తో చెప్పేను. తక్షణం ఫోటో పంపించేయమని సలహా యిచ్చేరు.

ఆరోజే బాగా సెంట్ పూసుకొని ఫోటో తీయించుకొని, మర్నాడు బాక్సు నెం. 1819 కి పంపించేను.

ఆ వారమంతా మా కెవ్వరికి మనశ్శాంతి లేకపోయింది. ఒకవేళ పెళ్ళివారు ముహూర్తం పెట్టేసి, హాస్టల్లోకి దిగబడతారేమో అని బయమేసింది. 'ఇమ్‌పాసిబిల్' అన్నాడు ఒకడు 'వాళ్ళు ఒప్పుకున్నప్పుడు, మనం ఒప్పుకోవద్దా'ని అన్నాడు యింకొకడు.

ఒక వారం గడిచింది. పోస్టమేన్ ఒకవుత్తరం తెచ్చియిచ్చేడు. 'పెళ్లివారి ఉత్తరం అయివుంటుంద'ని రామం అన్నాడు. "కాదు మానాన్న వ్రాతలాగ వుంద'న్నాను. ఆతృతతో యిప్పిచదివేను. మా నాన్న వ్రాసిన వుత్తరం ఇది:-

"చి॥ గోపాల్‌కి,

నువ్వు యింతవాడి వయ్యావని నే నెన్నడూ అనుకోలేదు. ఇకనైనా ఇటువంటి పాడుపనులు చేయక, నీచదువు నువ్వు చూసుకొనేటట్టయితేనే, అక్కడ వుండు. లేకుంటే చదువు మానేసి వచ్చేయి......" అని ఇంకా ఏమేమో కఠినంగా వ్రాసేరు.

నా ఒళ్ళు నీరయింది. నోటివెంట మాటరాలేదు. ఏమిటయి వుంటుందా అని కంగారుపడ్డారు. నా స్నేహితులు మెల్లగా చెప్పేను. "ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది — మా చెల్లెలి పెళ్ళికోసమై మానాన్న పత్రికలో వేస్తానని, నాతో యిదివరకు ఒకసారి చెప్పేడు......" నాకు ధైర్యం చెప్పేరు నాఫ్రెండ్స్.

గోపాల్

## జబ్బు కుదిరింది

అది ఇంగ్లీషువారు పరిపాలిస్తున్న కాలం ప్రతివ్యక్తి ఎవరికి తోచినంత దేశసేవ వారు చేసేవారు. దేశసేవ అంటే రాజకీయాల్లో పాల్గొనడము మాత్రమే కాదుకదా! దేశభాష వ్రాయడం, ఖద్దరు కట్టడంకూడ దేశసేవే.

మా రామం కలక్టరాఫీసులో గుమాస్తా. వాడు యెప్పుడూ తెనుగులోనే మాట్లాడేవాడు. ఏంరా ఇంగ్లీషు మాట్లాడకూడదటరా. ఎప్పుడూ తెనుగే అంటే వాడు మన మాతృభాషమీద మనం అమాత్రం అభిమానం చూపకపోతే ఎలాగా? అందుచేత నేను మాట్లాడతాననేవాడు.

రామంకి వాళ్ల మామగారు గర్భాధాన ముహూర్తానికి రమ్మని ఉత్తరం వ్రాసేరు. వెంటనే రామం అఫీసరు గార్కి ఇంగ్లీషులో వ్రాయడానికి ఇష్టం లేక తెనుగుపదాలు ఉపయోగిస్తూ సెలవుచీటి వ్రాసేడు. "అయ్యా నేను నాభార్య గర్భాధాన మహోత్సవానికి వెళ్ళాలి. కనుక నాకు రెండురోజులు సెలవు యిప్పించండి" గర్భాధాన ముహూర్తం అంటే ఏమిటో అర్థంకాని ఆఫీసరు నువ్వు వెళ్ళడానికి వీల్లేదు. ఆఫీసులో చాలా పనులున్నాయి. ఆ గర్భాధాన మహోత్సవమునకు ఇంకెవ్వరినైన పంపించు అనేసరికి రామం నిలువున నీరైపోయేడు. అప్పటినుంచి ఇంగ్లీషు వ్రాస్తున్నప్పుడు తెనుగుపదాలు ఉపయోగించు జబ్బు మా రామంకి కుదిరిపోయింది. ఫీల్డానా అప్పారావు